కథ

# జాతర

## —చిత్తర్వు మధు

తెల్లవారుతోంది.

వేసవికాలం అవడంవల్ల సూర్యుడుదయించకముందు కూడా వెచ్చగానే వుంది. బస్‌స్టాండ్ చుట్టూరావున్న కాఫీ, టీ దుకాణాల్లో కొంతమంది జనం అప్పడే ఇడ్లీలూ, దోసెలూ ఆకుల్లో పెట్టుకుని నిలబడే తింటున్నారు. గ్యాస్‌పొయ్యిలమీద కాఫీ, టీ నీళ్లు కాగుతూ అవిర్లొస్తున్నాయి.

హైదరాబాద్‌నుంచి వచ్చిన డీలక్స్ బస్ విసురుగా దుమ్మురేపుకుంటూ మలుపుతిరిగి బస్‌స్టాండ్ లోపల ఆగింది. రిక్షావాళ్లు, ఆటోడ్రైవర్లు బిలబిలా బేరాలకోసం తెరచిన బస్ తలుపుదగ్గర నిలబడి ప్రయాణికులని "రిక్షా! రిక్షా సార్!! ఆటో కావాలా బాబూ! కూలీ, కూలీ సార్!"అనే అరుపులతో చుట్టుముట్టారు. రణగొణ ధ్వనిగా వుంది.

అందరు ప్రయాణికులూ దిగేసింతర్వాత చిట్టచివరికి అతను దిగాడు. రాత్రంతా చేసిన ప్రయాణం వల్ల నలిగిన దుస్తులూ, నల్లబడిన ముఖమూ, భుజానికి వేలాడే నల్లటి ట్రావెలింగ్ బ్యాగ్, తెల్ల పాంటూ షర్ట్ టక్ చేసి ధరించాడు. వెత్తిన పలుచబడుతున్న వెంట్రుకలూ... గోల్డ్‌ఫ్రేమ్ కళ్లద్దాలూ... సిటీలో ఏదో పెద్ద ఉద్యోగస్థుడిలా వున్నాడు.

అతని వెనకనే కొద్దిగా కుంటుతూ, తడబడుతున్న నడకతో వస్తున్న పన్నెండేళ్ల అబ్బాయిని చేయిపట్టుకుని, "జాగ్రత్తా!జాగ్రత్తగా దిగు" అంటూ హెచ్చరించి చుట్టూ మూగిన రిక్షా, ఆటోడ్రైవర్ల సమూహంలో దారిచేసుకుంటూ ముందుకి నడుస్తూ శరభవరం పోవాలి, వస్తారా?" అని అడిగాడు.

"శరబారం అంటే..." వాళ్లల్లో వాళ్లు ముఖాలు చూసుకున్నారు.

"మట్టిరోడ్డు సార్. ఆరు కిలోమీటర్లు గతుకుల బాటమీద పోవాలి. వందరూపాయలిచ్చేయండి బాబూ... ఎల్లిపోదాం."

'వందా!' ఆశ్చర్యంగా అన్నాడతను.

"నడిచిపోయేవాళ్లం ఇదివరకు...ఇప్పడీ అబ్బాయి నడవలేడనిగానీ, లేకపోతే రిక్షా ఎందుకు...?"

"ఎనభై అయిదివ్వండి సార్!"

అతను మళ్లీ విసుగ్గా చూసి, "ఏభై రూపాయలిస్తా, పద!" అన్నాడు.

"డ్యాడీ!డ్యాడీ!" ముద్దుగా మాట్లాడుతూ దూరాన వున్న షాపుకేసి చూపించాడు ఆ అబ్బాయి. ఆ అబ్బాయి ముఖంలో కళ్లు పెద్దగాను, కనుబొమ్మలు దట్టంగానూ వున్నాయి. నోటికొన నుంచి లాలాజలం ధారగా కారుతోంది. అది తుడిచేందుకు కాబోలు మెడలో ఒక చేతిరుమాలు వేలాడుతోంది.

"అలాగే బాబూ, తవరు శరభారం జాతరకేనా ఏంటి?" అడిగాడు రిక్షా మనిషి.

"అవును! రేపేగా, శరభవరం శరభమ్మ జాతర!" అన్నాడతను ముక్తసరిగా.

"రేపే బాబూ, ఇప్పటివ్వడే జనాలొస్తున్నారు. కొందరు ఎడ్ల బళ్లుకట్టుకునీ, కొందరు కాలి నడకనూ, కార్లమీదా, దూరాన్నించీ, దగ్గర్నించీ, ఎన్నో వూళ్ల జనం... తమరు ఎవరింటికెళ్లాలీ? కరణంగారింటికా, లేక పెద్దనాయుడిగారింటికా?

అతను కొద్దిగా ఆలోచించి అన్నాడు– "తెలిసిన వాళ్లు ఎవరూ లేరు. కానీ వూళ్లో పాత సత్రం ఒకటి



వున్నదని విన్నాను. ఒక్కపూటకేగా, సాయంత్రం మళ్లీ వెళ్లిపోతాను!" అని చెప్పాడు.

"పాడుపడిన సత్రం ఒకటి వున్నాదికానీండీ, తమరిలాంటోళ్లుండేది కాదు బాబూ శుచీ శుభమూ ఏమీ వుండదు. పెద్దనాయుడిగారింటికి తీసికెళ్తా! పదండి! తమరిలాంటోరు ఓ పూట వుంటే మాత్రం ఆరేమనుకుంటారు?"

"అక్కడికిపోయాకచూద్దాం లే!" అన్నాడతను.

అతనూ, మానసికంగా వికలాంగుడిలా కనిపించే ఆ పిల్లవాడూ ఇద్దరూ కలిసి టిఫిన్ తినడం ముగించి రిక్షాలో కూర్చుని "ఇక పోనీ!" అనే వరకు ఉదయపు సూర్యుడు బారెడు దూరం ఆకాశంలోకెగసి కిరణాలు వేడిగా ప్రసరింపసాగాడు. పచ్చని పొలాల మధ్య చెట్లనడుమ ఎర్రటి మట్టిదారిలో రిక్షా సాగిపోతోంది.

"డ్యాడీ! అదేనా మనవూరు!" అడిగాడు ఆ అబ్బాయి ముద్ద మాటలతో.


"అవును బాబూ, అదే!" అన్నాడతను.

అలా అంటూంటే ఒక్కసారి అతనికి గతించిన గతం మెదడులో తళుక్కున మెరిసి మనసు బరువెక్కింది. చెప్పలేని వింత అనుభూతి.

...బాల్యం...రోజూ చీకటితో నిద్రలేచి ఇదే దారిన పుస్తకాలు పట్టుకుని పక్కవూరికి నడిచిపోవడం... సాయంత్రాలు గోధూళి వేళలో అలసిపో యి తిరిగిరావడం... రాత్రుల్లు హరికేన్ లాంతరు వెలుగులో కూర్చుని పుస్తకాలు చదువుకోవడం... సెలవులు...వంటకాలవలో ఈతలు... గోడుంబిల్ల ఆటలు... సంవత్సరం, సంవత్సరం వచ్చే పండుగలు... అన్నింటికీ మించి వేసంకాలంలో వచ్చే శరభమ్మ జాతర...

వూరికి దక్షిణాన శరభమ్మ గుడి. గుడినానుకుని రావిచెట్టు. గుడంటే, విగ్రహంలేని గుడి. గుడిలో మధ్య గదిలో చీకటిగా వుండి, దాని మధ్యగా కట్టిన ఎత్తైన గద్దెమీద కూర్చుని వుండేది శరభమ్మ దేవత. ప్రతి సంవత్సరం చైత్రమాసంలో వచ్చే ఆఖరి శుక్రవారం ,శనివారం జాతర జరిపేవారు.

శరభమ్మ అంటే దేవుడి బొమ్మకాదు. మనిషి. ఆడమనిషి కాదు. మగ మనిషి. అందరూ 'దేవుడు' అని వ్యవహరించే దేవుడు శరభయ్య గారే! చీరా



రవికా కట్టుకుని నగలు ధరించి బొట్టూ కాటుక పెట్టుకుని ఆ గద్దె మీద ప్రతి శుక్రవారం పీఠం వేసుకుని కూర్చునేవాడు. ఆయనకి 'శరభమ్మ' పూనేది!.

శుక్రవారం, శనివారం రెండురోజులు ఆయన పూనకంలో వుండే వాడు. చుట్టుపక్కల గ్రామాల్లోంచి ఎంతోమంది జనం కాలినడకనా, ఎడ్లు బళ్లు కట్టుకునీ ప్రతి శుక్రవారం, శనివారం శరభారం వచ్చే వారు. వూరి మధ్యగా పెద్ద చెరువుండేది. (ఇప్పటికీ వుండే వుంటుంది) దాని ఒడ్డున వున్న వేపచెట్లూ, రావి చెట్ల కింద బళ్లు దింపుకుని మకాం చేసేవారు. చెరువులో స్నానాలు చేసి చెట్ల కింద వంటలు వండుకుని తిని శరభమ్మ దర్శనం చేసుకుని వెళ్లేవారు

మనుషుల్లో వివిధ రకాలున్నట్లే వాళ్ల కష్టాలు కూడా పలువిధాలుగా వుండేవి. గేదె తప్పిపోయిందని ఒకరి సమస్య అయితే పిల్లకి పెళ్లికాలేదని ఒకరికీ, పట్నం మందులకి తగ్గని రోగం ఒకరికి వస్తే భార్య లేచిపోయిందని మరొకరికీ అలా ఎన్నో రకాల కష్టాలు వుండేవి. అవన్నీ శరభమ్మ తల్లికి చెప్పకునే వారు. చుట్టూ దీపాల వెలుగులో శరభయ్య చీరా రవికె వేషంలో కూర్చుని గద్దెమీద పూనకంతో వూగిపోతూ ఒక్కొక్కరి సమస్యకి పరిష్కారం సూచించేవాడు. ఆ పూనకంలో అతని భాష రాగయుక్తంగా ప్రత్యేకమైన ఒక శైలిలో వుండేది. దాన్ని జనం 'సకినం' అనేవారు. (శకునం అనే మాటకి వికృతేమో అది).

వేపాక మండలు చేతిలో పెట్టుకుని వూగుతూ అర్థనిమీలిత నేత్రాలతో... వూరికి దక్షిణాన మూడు కోసుల దూరంలో నీ గేదె బందిల దొడ్డిలో వుందిరో! ఎల్లి ఇడిపించుకోరో!

"ఇరవై యొక్క శనివారాలు వుపవాసం చేసి రావిచెట్టు చుట్టూ నూటొక్క ప్రదక్షిణాలు చేయిరో! తిరుపతెంకన్నకి ఏడూళ్లు జోగి అడిగి నడిచి పోయిరారో! సంవత్సరం తిరిగే సరిగి పిల్ల పెళ్లయిపోతుందిరో!"

ఈ విధంగా పరిష్కారాలు సకినంలో వచ్చేవి. అలాగే జరిగేవికూడా.

"చిన్న దేవుడు పెద్ద దేవుడికి సిఫారసు చేసినట్లు శరభయ్య తెలివిగా భక్తుల బాధల్ని తిరుపతికీ, కోటప్పకొండకీ – రికమెండ్ చేశేవాడు. అవసరమైన చోట పట్నంలో ఇంగ్లీషు డాక్టరు చేత ఆపరేషన్ చేయించుకోమనీ, శరభయ్య తల్లికి పట్టుచీరా గొలుసూ పెట్టమనీ ఉభయతారకంగా సూచించే వాడు.

ఏది ఏమైనా చాలా మంది భక్తుల సమస్యలు తీరేవే అనుకోవాలి. కాబట్టే జనం మళ్లీ మళ్లీ తిరిగివచ్చేవారు.

పనులు జరిగిన వాళ్లు చీరలూ కొబ్బరికాయలూ, పసుపు కుంకుమలూ, ఒక్కోసారి బంగారు నగలూ కూడా తెచ్చి శరభమ్మకి సంతోషంగా సమర్పించే వారు.

ఇక సంవత్సరానికొకసారి జరిగే శరభమ్మ జాతర కన్నుల పండువగా జరిగేది.

వూరంతా దీపాలతో అలంకరించి, రకరకాల దుకాణాలు తెరిచేవారు. ఎక్కడలేని జనం వూరంతా నిండిపోయేవారు. శుక్రవారం ఉదయం శరభమ్మ వూరేగింపుగా వచ్చి చెరువులో స్నానం చేసేది. ఆవిడ వూరేగుతున్న బండి ముందు పెద్దవాసానికి మర్రిఆకులు కట్టుకుని కాళ్లకి గజ్జలతో ముఖాన బుర్ర మీసాలూ ఎర్రటి బొట్టుతో, మెరిసే ఎర్రటి కళ్లతో భయంకరంగా కనిపించే 'పోతురాజు'నృత్యం చేస్తూ అనుసరించే వాడు.

గ్రామ దేవతలు ఏడుగురు అక్కాచెల్లెళ్లట. వాళ్లందరికీ ఒక్కగానొక్క తమ్ముడు ఈ పోతురాజు అని చెప్పకునేవారు. అప్పడప్పడు వూరేగింపులో అతనికి కూడా ఆగ్రహావేశాలతో 'పూనకం' వచ్చేది. ఆ సందర్భంలో అతను కోపంతో వూగిపోతూ నోట్లో వేలు పెట్టుకుని కొరికేనుకొనేవాడు! ఆ సమయంలో అతనినోట్లో వేలు లాగేసి కోడిపిల్ల మెడని పెడితే కసుక్కున కొరికేసే వాడని చెప్పకునేవారు.

... అదే బాబూ మనూరు! "దూరాన కనిపించే గుడిసెలూ, చెట్ల సమూహాన్ని చూపించి అతను చెప్పాడు.

పిల్లవాడు అస్పష్టమైన ముద్దమాటలతో "మరి గుడి ఏదీ? ఆవులూ గేదెలూ ఏవీ?"అనడిగాడు.

అతనికి ఆశ్చర్యంగా వుంది. ఇన్ని సంవత్సరాల తర్వాత శరభవరం తిరిగి రావల్సిన అవసరం వస్తుందని ఎప్పడూ అనుకోలేదు.!

...ఈ పిల్లవాడు తనకి ఒక్కడే కొడుకు. పుట్టడం బాగానే పుట్టాడు. పుట్టిన నాలుగేళ్లకే తన భార్య చనిపోయింది. కారణం, జ్వరం, ఫిట్స్! మూడేరోజులు హాస్పిటల్‌లో వుంది. అంతే.

ఆమె పోయిన తరువాత తనొక్కడే పెంచుతున్నాడు ఈ పిల్లవాడిని, ఆయా సహాయంతో... వాడినే సర్వస్వంగా భావించి రోజులు గడుపుతున్నాడు.

...అతనికి జరిగింది తల్చుకుంటే మనసు గగుర్పొడుస్తోంది. తనొక్కడి జీవితంలో ఇన్ని కష్టాలా? ఇంత మనోవేదనా? తల్లీ తండ్రి మంచి ఎడబాటూ, భార్యా వియోగం ... పిల్లవాడి సంరక్షణా... ఇన్ని పరీక్షలు ఎదుర్కోవడానికి ఎంత ధైర్యం కావాలి...

తట్టుకున్నాడు తను. ఎందుకంటే...

మానసిక వైద్యంలో డిగ్రీ తీసుకుని నగరంలో మానసిక చికిత్స చేస్తూ పేరొందిన మానసిక వైద్యులలో తనొక్కడు కనుక...!

దేవుడు లేడనీ, సంఘటనలు అలాగే జరిగిపోతుంటాయి, మన చర్యలకి మనమే బాధ్యులం అనీ, అంతా కాకతాళీయంగా జరుగుతోంది కాబట్టే పరిస్థితి కొనసాగుతోందనీ నమ్మే వ్యక్తి తను.



## రేఖకొచ్చిన అవార్డు

ప్రఖ్యాత కథక్ నృత్య కళాకారుడు బిర్జు మహారాజ్ పేరుతో ఇచ్చే అవార్డుకు ఈసారి రేఖని ఎంపిక చేశారట. అభినందిద్దామని రేఖకి ఫోన్ చేస్తే, నవ్వుతూ తానెప్పుడూ డాన్సులు చేయడం నేర్చుకోలేదంది. బహుశాః ఈ అవార్డు తాను బాగా నృత్యం చేస్తుందని కాక మగాళ్ళతో బాగా చేయిస్తుందని ఇచ్చారేమో?

భార్య తన జీవితంలోకి ఎలా వచ్చిందో అలాగే నిష్క్రమించింది. ఈ పిల్లవాడు తనకి మిగిలాడు చాలు. మిగిలిన జీవితం గడిపేయగలను అనుకున్నాడు. మిత్రులు, శ్రేయోభిలాషులు బతిమిలాడినా మళ్లీ పెళ్లిచేసుకోలేదు. అన్నీ మరిచిపోగలనని గుండె రాయి చేసుకున్నాడు. మహానగరంలో నా మానసిక రోగులు, వాళ్లకిచ్చే సైకోథెరపీ – అదే తన ప్రపంచం అని సరి పెట్టుకున్నాడు. అంతలోనే తన ప్రపంచం అల్లకల్లోలమై బతుకు తారుమారయ్యే సంఘటనలు జరుగుతాయని ఊహించలేదు.

రిక్షా సన్నని దారిన గతుకుల్లోంచి పోతోంది. దారికటూ యిటూ పేర్లు చెక్కిన నాపరాళ్లుపాతిపెట్టివున్నాయి. ఇరువైపులా చింతచెట్లు రావి చెట్లూ దట్టంగా కమ్ముకుని వున్నాయి.

స్మశానం...! ముప్పై ఏళ్ల క్రితం కూడా ఇదే విధంగా వుండేది. దగ్గరి దారి అని స్మశానంలోని కాలి దారిన నడిచి వూరికి వెళ్లిపోయేవారు. బడినుంచి రావడం పోవడం, పక్కవూరికి ఈ దారినే నడిచి వెళ్లేవాడు తను. అర్ధరాత్రయినా కొద్దిగా కూడా భయం వేసేది కాదు.

మనిషి పుట్టుక, జీవితం, తర్వాత చావు... ఆ తర్వాత మిగిలేది శూన్యం... ఏమీ లేదు అనే తన నమ్మకానికి అదే పునాది కావచ్చు. అందుకే, చింత చెట్లు ఆ కాలంలో నీడలా కదలాడినా, గాలి కీచుమని హోరుపెట్టినా, దయ్యాలని భయం ఏనాడూ కలగలేదు. వున్నది వున్నది. లేనిది లేదు. కార్యానికి కారణం నేమా, మెదడుకి అస్తిత్వం జ్ఞానం. ఈ సృష్టిలో ఇదికాక ఏమీ లేదు అని నమ్మే పట్టుదల ఆనాటిదే.

కానీ,... ఓ రోజు క్లినిక్ నుంచి ఇంటికి వెళ్లేసరికి స్కూలుకి వెళ్లకుండా జ్వరంతో పడుకున్న కొడుకుని చూశాడు. ...మళ్లీ అదే జ్వరం, అదే అపస్మారకం... అవే ఫిట్స్... గడిచిపోయిన పీడకలల్లోకి మళ్లీ మళ్లీ చక్రభ్రమణంలా... చివరికి...ఎంతో మంది న్యూరాలజిస్టులు, స్పెషలిస్ట్ డాక్టర్లు చూసి, చూసి, ఎన్నో మందులిచ్చి, హాస్పిటల్ నుంచి హాస్పిటల్‌కి మారి, ఇంజక్షన్ నుంచి ఇంకా శక్తిమంతమైన ఇంజక్షన్‌లకి మారి... ఇంకా ఏమైనా వైద్యం వుందా అని పుస్తకాలు తిరగెయ్యడం, పీడకలల భయంకర రాత్రులు, ఆవేదన... మనసుని కత్తిలా కోసే పుత్ర ప్రేమ తండ్రికే తెలుస్తుంది... అన్నీ అబద్ధమైనా ఆ బాధ నిజంకాదా, అంతా ముందు నిర్ణయించినా, కాకపోయినా, ఆ క్షణాల బాధ, చిత్రవధా నిజమైనవే కాదా?

ఆ దుర్భరమైన బలహీన క్షణాలలోనే అతను మొక్కని దేవుడు లేడు. వాళ్లకి ప్రామిస్ చెయ్యని మొక్కు లేదు. టి.బి. మెనింజైటిస్ అన్నారు. ఎన్‌కెఫలైటిస్ అన్నారు. ఏదైనాకాని ఆ పిల్లవాడి 'కోమా' తగ్గి తిరిగి స్పృహలోకి వచ్చేటందుకు వారానికి పైనే పట్టింది.

ఆ చివరి క్షణాల్లోనే 'ఇక ఓడిపోయాననిపించి, మొక్కుకున్నాడు. చేతులు జోడించి తూర్పువైపు తిరిగి "తల్లీ శరభారం శరభమ్మ, నాపిల్లవాడికి జబ్బు తగ్గి మామూలు మనిషైతే నీ జాతర కొస్తా! నూటొక్క కొబ్బరికాయలు కొడతా, చీరా రవికే పెడతా, రక్షించు తల్లీ!'

అది నమ్మకం సడలిపోయిన బలహీనమైన క్షణమో, కొత్త అనుభూతుల, కొత్త అన్వేషణల అధ్యాయానికి నాందో కానీ, తన మనఃసాక్షిగా జరిగిన నిజం అదే!

ఆ మర్నాడే తనకొడుకు కోమాలోంచి బయటపడి కళ్లుతెరిచాడు. జ్వరం నార్మల్‌కి వచ్చింది. ఇక మళ్లీ పెరగలేదు. "టి.బి. మందులు పనిచేశాయన్నాడు ఫిల్లిప్స్ స్పెషలిస్ట్. తనకు మాత్రం గద్దె మీద కూర్చున్న శరభమ్మ రూపం, పూనకంతో వూగిపోతూ, వేపమండలు పట్టుకుని నకినం చెబుతున్నట్లు కనిపించింది.

జ్వరం తగ్గింది, ప్రాణం దక్కింది కానీ, మెదడు శాశ్వతంగా దెబ్బతినడం వల్ల ఒక కాలుచేయి సరిగా పనిచేయకుండా అయిపోయాయి. కొద్దిగా చెముడు వచ్చింది. కానీ పిల్లవాడి తెలివితేటలు మాత్రం సరిగ్గానే వున్నాయి.

అదిచాలు అనుకున్నాడు. భార్యలాగానే పిల్లవాడు కూడా తెలియని పై లోకాలకి వెళ్లిపోతాడనుకున్నాడు. కానీ, వాడు తన కళ్లముందు మిగిలాడు అదేచాలు... అదే ఒక వరంగా భావించాడు.

నమ్మినా, నమ్మకపోయినా అనుకున్నది అయింది కనుక శరభమ్మ మొక్కు తీర్చాల్సిందే! అది తన బలహీనతా? లేక యాదృచ్ఛికమో... ఏదైనా కాని వాగ్దానం తీర్చక తప్పదు. కృతజ్ఞత తీర్చక తప్పదు... ఫలితమే ఈ ప్రయాణం. శరభమ్మ జాతర రోజుకి పిల్లవాడిని తీసుకుని ఈ వూళ్లో అడుగుపెట్టగలిగాడు.

"మాట చెల్లించుకోవాల్సిందే, ఎందుకంటే మిగిలిందంతా శూన్యం కనుక...

రిక్షా వూళ్లో ప్రవేశించి పాతకాలం నాటి ఎత్తు అరుగులున్న సత్రం ముంగిట ఆగింది.

జ్ఞాపకాల్లోంచి బయటపడి రిక్షాకి డబ్బులిచ్చి లోపలికి నడిచాడతను.

సత్రంలో పాతవీ మట్టికొట్టుకుపోయిన గదులున్నాయి. బయట బావి దగ్గర కొందరు బిందెలతో తలస్నానాలు చేస్తున్నారు. లోపల హాల్లోనూ గదుల్లోనూ కొందరు నేల మీద గుడ్డలు పరుచుకుని పడుకున్నారు. ఆవరణలో వున్న చెట్లకింద కొందరు ఇటుకరాళ్ల పొయ్యిల మధ్య కట్టెల మంట వేసి వంటలు వండుకుంటున్నారు.

కావాలనే అతను ఇంత అసౌకర్యానికి సిద్ధపడ్డాడు. కొంచెం ఆందోళనగా చూస్తున్న రిక్షావాడిని చూసి "కాసిన్ని వేడినీళ్లు బకెట్‌లో తెచ్చిపెట్టు. మా అబ్బాయి చన్నీళ్ల స్నానం చేయలేడు!"అని అడిగాడు.

రిక్షావాడు సంతోషంగా ఒప్పుకున్నాడు. పెద్దింటి మనిషిలా కనిపించే ఈయన సత్రంలో వుండటం అతనికి బాధనిపించినట్లుంది. ఏదో ఒకటి సాయం చేయాలనిపిస్తోంది.

"బాబూ, తమరికేమన్నా తినడానికి కావాలా? చెప్పండి, తెచ్చిపెడతా" అన్నాడు.

"ఒద్దు! స్నానం చేసి గుడికెళ్లడం, కొబ్బరికాయలు కొట్టి శరభమ్మ దేవతకి చీర పెట్టింతర్వాత తిరిగి వెళ్లిపోవడమే. రాత్రి బస్‌కి హైదరాబాద్ వెళ్లిపోవాలి!"అన్నాడు.

"అయ్యో బాబూ, రేతిరికి జరిగే జాతరా, ప్రభలు కట్టిన దీపాల బళ్లతో వూరేగింపులూ చూడరా తమరు?"

అవును. శరభయ్యి చీరకట్టుకుని నగలు సింగారించుకుని ట్యూబ్‌లైట్ల కాంతిలో ఎడ్ల బండిమీద నిలబడేవాడు. ఆ వెనకాల డజన్లకొద్దీ ఎడ్లబళ్లు కానీ ట్రాక్టర్లు కానీ, దీపాలతో అలంకరించినవి లైనుగా అనుసరించేవి. అవే ప్రభ బళ్లు. వాటి ముందుగా పోతురాజు నృత్యం చేసేవాడు.

డప్పులూ, బాజాలు, వీరంగం వాయించే సన్నాయి శబ్దాలతో వూరు దద్దరిల్లేది.

...ప్రతి ఇంటిదగ్గరా ఆగిన దేవుడు శరభయ్యకి "శరభమ్మ తల్లీ! దండాలు!" అని సాగిలపడి మొక్కి ఇంటింటా హారతి ఇచ్చి కొబ్బరికాయలు కొట్టేవారు.

తను ఓ పక్కగా నీడలో నిలబడి ఇవన్నీ చూసేవాడు.

మరో దృశ్యం...శుక్రవారం తెల్లవారిన సమయంలోనే ఎక్కడెక్కడో వూళ్లనుంచి దయ్యం పట్టిన ఆడవాళ్లని శరభయ్య దగ్గర చికిత్సకోసం తీసుకొచ్చిన వాళ్లని చెరువులో ముంచేవాళ్లు. వాళ్లు తడిగుడ్డలతో జుట్టు విరబోసుకుని, పసుపు కుంకుమలు తలకి రాసుకుని నిజంగా దయ్యాల్లానే నిలబడివున్న సమయంలో, తెల తెలవారుతుండగా 'దేవుడు శరభయ్య ఆడవేషంలో చెరువుగట్టు దగ్గరికి బండిమీద పోతురాజు సమేతంగా డప్పులతో వీరంగాలతో వచ్చేవాడు.

చెరువులో మూడుసార్లు మునిగి తేలాక డప్పుల హోరులో దయ్యాలు పట్టిన స్త్రీలకి దయ్యాలు వదిలించే ప్రక్రియ ప్రారంభమయ్యేది. అంటే, చుట్టూ డప్పులూ, సన్నాయి వాద్యాలు మోగుతుంటే వాళ్లందరినీ జుట్టుపట్టుకుని చింత బరికతో చితక బాదటం అన్నమాట.

అదొక వింతైన భయానక దృశ్యం. జుట్టు విరబోసుకున్న ఆడవాళ్లు వాళ్ల వ్యాధులు మానసికమైనవో, శారీరకమైనవో, హిస్టీరియావో, ఏదైనాకాని గ్రామీణుల దృష్టిలో వాళ్లు దయ్యాలు ఆవహించిన వ్యక్తులు!

డప్పుల శబ్దం చెవులు బద్దలయ్యేట్లు పెరిగి, సన్నాయిల వీరంగం పతాక స్థాయికి చేరుకునేది.


చింతబరికెతో మోదుతూ, "దిగు! దిగు! దిగావా! లేదా?" అని అరుస్తూ భయవిహ్వలమైన ఆడవాళ్లని జుట్టుపట్టుకుని వీపు చిట్లగొట్టడం కాసేపటికి వాళ్లు "వదిలింది తల్లో, వదిలింది తల్లో!" అని చెంపలు వాయించుకోవడం...

... ఉదయం దయ్యాలు వదిలిన ఆ ఆడవాళ్లు ఆ రాత్రి వూరేగింపులో దేవుడు శరభయ్య బండిముందు పోతరాజు చుట్టూ నృత్యం చేస్తూ వూరేగే వారు. బండిపైన శరభయ్య, ఆడ వేషంలో, దానికెదురుగా లైట్ల వెలుతురులో భీకరాకారం పోతురాజు అతని చుట్టూ వేపమండలు పట్టుకుని ఎగురుతున్న ఆడవాళ్లూ...అదే వూరేగింపు.

మూడు దశాబ్దాలు గడిచిపోయాయి. దేవుడు శరభయ్య శరభారంలో నడిచే దేవుడిగా ఒక వెలుగు వెలిగి నిష్క్రమించాడు. అతనికి కూడా జబ్బు మరణం తప్పలేదు.

మిగిలినవి జ్ఞాపకాలు మాత్రమే! ఇప్పుడు జాతర ఎవరు చేస్తున్నారు? రాత్రి వూరేగింపు ఎలా చేస్తున్నారు?

"శరభయ్యగారి ఫొటో పెట్టుకుని జాతల నడిపించేస్తున్నారండి! శరభమ్మ తల్లి అయిన తర్వాత ఆయన కొడుకుమీద గాని, మరెవరిమీద గాని 'వాల' లేదండి. గద్దెమీద ఎవరూ కూకోడం లేదండి. అయినా నమ్మకం వున్నవాళ్లు వస్తూనే వున్నారండి!".... గుడి దగ్గర కొబ్బరికాయలు దుకాణంలో మనిషి వివరిస్తున్నాడు.




తన పిల్లవాడికి స్నానం చేయించి కొత్తబట్టలు వేసి తనుకూడా పంచె లాల్చీ ధరించి, ఒక సంచిలో నాటొక్క కొబ్బరి కాయలు కొనిపెట్టుకుని, అగరొత్తులు, సాంబ్రాణీ, హారతి కర్పూరం, ఎర్రరంగు చీరా, రవికే పెట్టిన పళ్లెం తీసుకుని, గుడి ద్వారం ముందు నిలబడ్డాడు.

భక్తుల క్యూ చాలా పొడుగ్గా వుంది. అతనికి విచిత్రం అనిపించింది.నగరంలో ఎంతో మందికి మానసిక చికిత్స చేసే తను, ఇక్కడ.... ఈ జన సందోహంలో...ఎందుకు? ఇలా... ఎవరికీ తెలియకుండా, అనామకంగా నిలబడివున్నాడు?

తన బలహీనత అందరికీ తెలియకూడదనా! తన నమ్మకాలలోని మార్పు వ్యక్తిత్వంలోని పరిణామం గ్రామస్థులు గుర్తించకూడదనా?...

నిజాన్ని దాచడమెందుకు? అతను ఏదీ తేల్చుకోలేకపోతున్నాడు. గుడి బయట లౌడ్ స్పీకర్లలో నుంచి పెద్ద చప్పుడుతో సినిమాపాటలు... దూరంగా డప్పుల సన్నాయిల మోత. క్యూ నెమ్మదిగా ముందుకు కదులుతోంది.

అతని మనసు దశాబ్దాల వెనక్కి పరుగెడుతూ మళ్లీ వర్తమానంలో వుండటానికి ప్రయత్నం చేస్తోంది.

ఇదంతా వృథా యేమో!బలహీనమైన తన మనసు చేసిన మాయ యేమో! ఈ మూఢనమ్మకం వల్ల తన మీద తనకి వున్న విశ్వాసం హరించుకుపోతోంది.

అతను ఆలోచిస్తుండగానే క్యూలో తోపిడి పెరిగింది.

...ఆ రాపిడి వల్లనో, ఎండ వేడిమి వల్లనో, గాలి లేని అసౌకర్యం వల్లో పిల్లవాడు "డ్యాడీ! డ్యాడీ! నాకిక్కడ బాగాలేదు. పోదాం!" అని మెల్లగా ఏడవసాగాడు.

తిరిగి వెళ్లిపోనా! అని అతనికి అనిపించింది. దూరాన డప్పుల మోత, సన్నాయి వీరంగం క్రమక్రమంగా దగ్గరయి వినిపిస్తోంది.

'శరభమ్మ తల్లి' జమ్మికొట్టి వస్తోంది అనుకుంటున్నారు భక్తులు.

వూరి బయట జమ్మి చెట్టు దగ్గరకి వెళ్లి దయ్యాల్ని చెట్టెంక్కించి తిరిగి వచ్చే వాడు శరభయ్య. అదే సంప్రదాయం ఇప్పటికీ పాటిస్తున్నారు.

చూస్తుండగానే డప్పడల మోత మరింత దగ్గరై, చెవులు దద్దరిల్లే సన్నాయి మోతలతో, శరభమ్మ ఫొటో పెట్టిన ట్రాక్టర్ బండీ, దానిముందు కర్ర పెట్టుకుని ఎగురుతున్న ముసలి పోతురాజూ అతని చుట్టూ 'వలా, వలా' అంటూ ఎగురుతున్న భక్తుల సమూహమూ గుడిముందుకు చేరుకుంది.

...పిల్లవాడు హఠాత్తుగా కిందపడి కాళ్లూ చేతులూ కొట్టుకోసాగాడు. అతతని నాలుక పంటి కింద ఇరుక్కొని రక్తంతో కలిసిన నురగ నోటినుంచి దారగా కారసాగింది.

క్యూలో కల్లోలం చెలరేగింది. జనం మూగి, పిల్లవాడి మూర్ఛను తగ్గించే ప్రయత్నం చెయ్యసాగారు. ఒకరు చేతిలో తాళం పెట్టీ, మరొకరు రెండు చేతులు గట్టిగా పట్టుకుని రుద్దుతూ ఏవేవో చెయ్యసాగారు.

అతను అప్రతిభుడై నిలిచిపోయాడు. అతని గుండె బాధతో మూలిగిపోతోంది.

"శరభమ్మ తల్లీ! నా కొడుకుని రక్షించు! నిన్ను అవమానించి పాపం చేశాను! ప్లీజ్! రక్షించు!" ప్రార్థిస్తున్నాడు.

మానసిక శాస్త్రజ్ఞుడూ, ఇంతసేపూ ఏది సత్యం, ఏది అసత్యం అని అసందిగ్ధావస్థలో వున్న వాడు అయిన అతను– కన్న కొడుకు బాధ చూస్తూనే అప్రయత్నంగా మళ్లీ శరభమ్మ తల్లికి మొక్కసాగాడు.



## సినీ తారల ప్రజాసేవ

మెగాస్టార్ చిరంజీవి ప్రారంభించిన ప్రజా సేవా కార్యక్రమాలకి దేశం మొత్తం నుంచి మంచి స్పందన లభించిందట. అదే బాటలో షబానా ఆజ్మీ, ఐశ్వర్యారాయ్ కళ్ళు దానం చేస్తే, పూజాభట్ కేన్సర్ పేషెంట్స్ కోసం నిధులు సమకూరుస్తోంది. అలాగే అనుపమ్ ఖేర్, సునీల్ శెట్టి వీధుల్లో తిరిగే అనాథ పిల్లలకు ఓ దారి చూపించడానికి ప్రయత్నిస్తున్నారు. సుస్మితా సేన్, పూజాబాత్రా ఎయిడ్స్ నిరోధానికి పాటుపడుతున్నారు. సినిమావాళ్ళ హృదయాలు ఎంత విశాలమో!

బాజాల మోతతో, వర్షంలా కురుస్తున్న పసుపూ కుంకుమా, చామంతి రెక్కల పూల జల్లుల మధ్య శరభమ్మ విగ్రహం మోసే గుంపు గర్భగుడివైపు ప్రవేశించింది.

భక్తులందరూ గ్రామీణులు. వారి స్థితిగతులు బీదవైనా మనసులు వున్నతమైనవి.

"తప్పుకోండి! తప్పుకోండి!. ఆ బాబును ముందు ఎల్లి తల్లిని చూసిరానీయండి!" అని అతనికి దారి ఇచ్చారు.

పిల్లవాడు కాళ్లు చేతులూ కొట్టుకోవడం ఆగి భారంగా శ్వాస తీసుకోసాగాడు.

మరో ఐదు నిమిషాలకే ఫిట్స్ వచ్చిన పిల్లవాడు తట్టిలేపినట్లుగా లేచి కూర్చున్నాడు. అతను పిల్లవాడిని భుజాన ఎత్తుకుని మోసుకుని గద్దెదాకా వెళ్లాడు.

"అశ్శరభ! అశ్శరభ!" అని కేకలూ, తప్పెట్లూ, సన్నాయి మోతల మధ్య పిల్లవాణ్ణి గద్దె ముందు శరభమ్మ ఫొటో ముందు పడుకోబెట్టి తను తెచ్చిన రవికెలగుడ్డా, చీరా కొబ్బరి కాయలూ కుంకుమా సమర్పించి నమస్కరించాడు. నూటొక్క కొబ్బరికాయలు కొట్టడానికి నూటొక్క నిమిషాలు పట్టింది!

నల్లటి మీసాలున్న పూజారి తండ్రీకొడుకులకి నుదుటిన సింధూరం దిద్దాడు.

ఆ తర్వాత బయటికి వచ్చేశారు.

సాయంత్రపుటెండ ఫెళఫెళా ఇంకా వేడిని చిమ్ముతూనే వుంది. లౌడ్ స్పీకర్లలో సినిమా పాటలూ, పిల్లలు వూదుతున్న బూరలధ్వనీ, వస్తువులు అమ్మే దుకాణాదార్ల కేకల మధ్య జనం హడావుడిగా తిరుగుతున్నారు.

"ఇంక ఇంటికి వెళ్లిపోవడమే బాబూ!" అని పిల్లవాడికి చెప్పి, వూరి మధ్య నున్న ఎర్రటి మట్టి బాటమీదగా నడుస్తూ రిక్షా కోసం వెదకసాగాడు.

రావి చెట్టు చుట్టూ వున్న రాతి అరుగు మీద చుట్ట కాలుస్తూ కూర్చున్న వయోధికుడు అతణ్ణి చూసి గుర్తుపట్టినట్లుగా ఒక్క ఉదుటున లేచాడు.

తెల్ల మీసాలూ, గడ్డం, నుదుటిన విబూధి రేఖలూ, ఒంటికి తెల్ల ఖద్దరు పంచే, లాల్చీ, చేతిలో పొన్ను కర్ర తొంభయ్యేళ్ల వయసున్నా సత్తువ సడలని ఊరి కరణం- రామయ్యశర్మ గారు.

"బాబూ!, బాబూ, నువ్వా! నువ్వు... నువ్వెప్పుడొచ్చావ్?"

అతనికి అర్థం అయింది. కరణంగారు తనని గుర్తుపట్టారు. నాలుగేళ్ల క్రితం పట్నానికి వైద్యం కోసం వచ్చినప్పుడు తనని కలుసుకుని మరీ వెళ్లారాయన. ఇక తప్పించుకోవడం కష్టం.

అయినా వినబడనట్లు ముందుకు అడుగేయబోయాడు.

"నువ్వు దేవుడి శరభయ్య కొడుకు చక్రవర్తివి కాదూ? ఎన్నేళ్లయింది నాయనా, నిన్ను చూసి. అదేమిటి? మా ఇంట్లోనన్నా దిగకుండా, గప్‌చుప్‌గా వెళ్లిపోతున్నావ్? ఊరంతా సంబరంతో శరభమ్మ పూజ చేసుకుంటుంటే, ఆయన కొడుకువి నువ్వు, వీడు నీ కొడుకు కాబోలు - ఎవరూ చూడకుండా వచ్చి వెళ్లిపోతున్నారా!"

...వయసు వల్ల వణుకుతూ మాట్లాడుతున్న కంఠస్వరం...

అతను, దేవుడు శరభయ్య కొడుకు. డాక్టర్ వీరేశ్వర చక్రవర్తి...!(మరొక గ్రామ దేవత వీరమ్మ పేరుతో తండ్రి పెట్టిన పేరు).

సమాధానంగా రెండు చేతులూ ఎత్తి నమస్కరించి, "నే వెళతా కరణం గారూ, నన్నాపకండి! అవతల చాలా పనులున్నాయి. పిల్లవాడికి ఒంట్లో బాగాలేకపోతే ఒక సారి గద్దెకు తీసుకువస్తానని మొక్కుకున్నా. అందుకనే రావాల్సి వచ్చింది. వొస్తా మరి..."

అతనికి రిక్షా ఒకటి ఖాళీది దొరికింది. ముప్పై ఏళ్లక్రితం చదువు కోసం పట్నం వెళతానని తాను గొడవ చేయడం, ఈ కరణం సమక్షంలోనే తానూ తండ్రీ ఘర్షణ పడటం గుర్తుకొస్తోంది అతనికాసమయంలో. రాక తప్పదు. బాధపడకా తప్పదు.

"కుల వృత్తి మానుకుని ఏపిటిరా నువ్వు చేసే నిర్వాకం? నా తర్వాత గద్దె మీద శరభమ్మ తల్లిగా నువ్వే కూకోవాలి! నువ్వు ఏం చదువుకుంటే ఏం లాభంరా! ఆ తల్లి నీ మీద వాలకపోయాక. మన కుటుంబగౌరవం ఏమైపోవాల? నా మాట యిను! ఇక్కడే వుండిపో!"

"శరభయ్య చెప్పింది సమంజసమే నాయనా! మీ నాన్న ఈ చుట్టు పక్కల దేవుడిగా ప్రఖ్యాతి గాంచా. ఆయన చెప్పిన 'సకినం' జోస్యంగా యదార్థమవుతోంది. నాకు తెలిసి ఏమీ లేని మీ నాన్న ఇప్పటికి ఐదెకరాల పొలం కొని డాబా కట్టించాడు. ఇదికాక ఎంతో ధనం, బంగారం సంపాదించాడు. ఆ వృత్తి మళ్లీ నువ్వే చేపట్టాలి నాయనా! సంప్రదాయం నడిపించాలి!" కరణం గారి అనునయ వాక్యాలు ఆనాడు తను చెవిన పెట్టలేదు.

"ఇదంతా నాకు నమ్మకం లేదు. చదువు... చదువే ముఖ్యం. మూఢనమ్మకాల్ని ప్రోత్సహించడం నాకిష్టం లేదు. వైద్యం చదువుతా! శాస్త్రీయంగా రోగాలు నయం చేసా! అదే నా ఆశయం! ఆ వూనకాలు నే వూనలేను. నా చేతకాదు."

హృదయపూర్వకంగా ఆనాడు చెప్పాడు. వూరు వదిలి వచ్చేశాడు. ఆనాటి నుంచి తండ్రీ కొడుకుల మధ్య అగాధమే వెలిసింది. మళ్లీ ఆయనని చూడలేదు. ఇరవై ఏళ్ల క్రితం ఆయన చనిపోయినప్పుడు మాత్రం దినవారాల కోసం వచ్చి వెళ్లాడు.

శరభారం శరభమ్మగుడికే తండ్రి సంపాదించిన ఐదెకరాలూ, బంగారమూ ఇచ్చేశాడు. ఎప్పటికైనా తనమీద శరభమ్మ తల్లి 'వాలుతుందని' ఆశించని గ్రామస్థులకి నిరుత్సాహమే మిగిలింది. మారిన జీవిత పరిస్థితులు, మధ్య వికలాంగుడైన ఈ పిల్లవాడితో మళ్లీ ఊళ్లో అడుగు పెట్టడం... తను ఊహించలేదు.

"రిక్షా త్వరాగా పోనీయ్! సాయంత్రం హైదరాబాద్ బస్‌కి అందుకోవాలి!"అన్నాడతను.

రిక్షా పంటపొలాల మధ్యగా సన్నని గతుకుల దారిలో పోతూంటే, పడమటి దిక్కున సూర్యుడు అస్తమించ సాగాడు.

అతను జీవిత సత్యాల గురించి ఒక నిర్ధారణకి రాలేక, ఆలోచించడం మానేసి అలసటగా కళ్లు మూసుకున్నాడు.

దూరాన ఊళ్లో ఒక్కసారి తళుక్కున విద్యుద్దీపాలన్నీ వెలిగాయి. రంగు రంగుల మిణుకు మిణుకు మనే లైట్లూ, ప్రభలు కట్టిన ఎడ్లబండ్లూ, వాటినుంచి వచ్చే లౌడ్ స్పీకర్లలోని సినిమా పాటలూ అప్పుడప్పుడూ మోగుతున్న డప్పులూ, వీరంగం మోగించే సన్నాయి ధ్వనులూ... అవన్నీ కలిసిన శబ్దం అస్పష్టంగా వినిపిస్తూ దూరమవుతోంది.

... ఆ ఊళ్లో జాతర సాగిపోతూనే ఉంది!.